సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



రాజ్యాంగానికి ప్రత్యేకత

ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాంగానికి ప్రత్యేకత ఉందని సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ అన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
40.5 /26.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అడుగంటిన భూగర్భజలాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగుంటుతున్నాయి. ఫీజో మీటర్ల ద్వారా మార్చి నెలకు సంబంధించిన నీటి మట్టాల లెక్కలను గ్రాఫ్, మ్యాప్ రూపంలో భూగర్భజల శాఖ అధికారులు సోమవారం విడుదల చేశారు. మొత్తం 82 ఫీజో మీటర్లు ఉండగా 33 ఫీజో మీటర్లలో సాధారణం కంటే 10మీటర్లలోపు నీటి మట్టాలున్నట్లు ఆ శాఖ డీడీ శ్రీనివాస్ బాబు వెల్లడించారు. అలాగే 23 ఫీజో మీటర్లలో 10–15 మీటర్ల లోతులో, 15–20 మీటర్లలో పదిహేను ఫీజో మీటర్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం వరికోతలు పూర్తయి వ్యవసాయ బోర్ల వాడకం తగ్గినందునా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉండకపోవచ్చన్నారు. జిల్లాలో సగటున 12.30 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి అరెస్ట్




కుమారుడు సాహిల్‌తో మాజీ ఎమ్మెల్యే షకీల్ (ఫైల్)

బోధన్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రహిల్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద బారికేడ్లను కారు ఢీకొన్న ఘటనలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కారు ప్రమాద ఘటన తర్వాత తప్పించుకొని సాహిల్ విదేశాలకు పారిపోయాడు. ఈ క్రమంలో సాహిల్‌పై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి గాలింపు చర్యలు చేపట్టారు. 2023 డిసెంబర్ 24న తెల్లవారు జామున జరిగిన ఈ ఘటనపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సాహిల్ తప్పించుకునేందుకు సహకరించారని అప్పటి పంజాగుట్ట సీఐ దుర్గారావును సస్పెండ్ చేయగా, నాటి బోధన్ టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు అయ్యారు. ఈ కేసు విషయంలో సాహిల్ హైకోర్టును ఆశ్రయించగా, ఇటీవల హైకోర్టు లుక్ అవుట్ నోటీసులను సస్పెండ్ చేసింది. తాజాగా దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన సాహిల్‌ను శంషాబాద్ ఎయిర్ పోర్టులో పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా ఈ నెల 22 వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అయితే ఈ ఘటనలో మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారని, ఆయనను కూడా అరెస్ట్ చేస్తారని ప్రచారం జరుగుతోంది. కుమా రుడి అరెస్టు నేపథ్యంలో షకీల్ అజ్ఞాతం వీడనున్నట్టు తెలుస్తోంది.

దిక్సూచి లేని నావలా బీఆర్ఎస్

కారు ప్రమాద ఘటన అనంతరం మాజీ ఎమ్మెల్యే షకీల్ నియోజకవర్గానికి దూరంగా ఉండిపోయారు. దీంతో బీఆర్ఎస్ కార్యక్రమాలు స్తంభించాయి. దిక్సూచి లేని నావాలా పార్టీ పరిస్థితి మారింది. నాయకులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు ఒక్కొక్కరు పార్టీ వీడుతున్నారు.



నూతనోత్సాహానికి నాంది.. ఉగాది

- నేడు తెలుగు నూతన సంవత్సరాది
- ఆలయాల్లో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

నిజామాబాద్ సిటీ: కోకిల పాటలు.. చిగురించిన ఆకులతో పచ్చని చెట్లతో ప్రకృతి కొత్త అందాలు సంతరించుకునే పండుగ ఉగాది.. ఆకురాలిన చెట్లు మళ్లీ చిగురించినట్లు కొత్త ఆశలతో క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలకడానికి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ప్రతీ ఇల్లు ఉగాది శోభను సంతరించుకుంది. మంగళవారం పండుగను ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఆలయాల్లో పూజలు, పంచాంగ పఠనానికి ఏర్పాట్లు చేశారు.



నగరంలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పచ్చడి ప్రత్యేకం

ఆరు రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. వేపపువ్వు, చింతపండు, కొత్త బెల్లం, మామిడి ముక్కలు, ఉప్పు, కారంతో దీనిని తయారు చేస్తారు. పచ్చడి ఆరోగ్యానికి మంచిది. పండుగ రోజు సాయంత్రం ప్రతి గ్రామంలో పంచాంగ పఠనం నిర్వహిస్తారు. కొత్త సంవత్సరంలో ఎలా ఉంటుందని పండితులు చెబుతుంటే ప్రజలు ఆసక్తిగా వింటారు.

కొత్త పనులు ప్రారంభం

ఉగాది రోజున కొత్త పనులను ప్రారంభించటం ఆనవాయితీగా వస్తోంది. ప్రధానంగా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. పశువులను అలంకరించి వ్యవసాయ భూముల్లోకి సేంద్రియ ఎరువులు తోలటం ఆరంభిస్తారు. వ్యాపారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఆలయాలను దర్శించాలి



ఉగాది రోజు ఆలయాలను దర్శించుకోవాలి. షడ్రుచులతో చేసిన పచ్చడిని తాగాలి. ఈ క్రోధి నామ సంవత్సరంలో ప్రశాంతంగా జీవించాలి. గత సంవత్సరం కంటే ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉంటాయి.

– జ్యోషి మధుసూదన్ శర్మ

స్మార్ట్ సిటీగా ఇందూరు

- ప్రభుత్వ ఇంజినీరింగ్, వ్యవసాయ, వెటర్నరీ, మహిళా డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయిస్తా
- జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు
- వరంగల్‌కు దీటుగా నిజామాబాద్‌ను అభివృద్ధి చేస్తాం
- 'గల్ఫ్' బోర్డు ఏర్పాటు చేస్తాం
- నిజాం షుగర్స్‌ను తెరిపించేందుకు రంగం సిద్ధం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

ఎంపీగా గెలిపిస్తే నిజామాబాద్ నగర అభివృద్ధి కోసం స్మార్ట్ సిటీ పథకాన్ని తీసుకొస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. తన సుదీర్ఘ అనుభవంతో వరంగల్ నగరానికి దీటుగా నిజామాబాద్‌ను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చుకున్నామని, కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తే బీజేపీ నాయకులు చెబుతున్నట్లు డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చినట్లేనన్నారు. సోమవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో జీవన్‌రెడ్డి పలు విషయాలపై మాట్లాడారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తుంది. పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేందుకు నిర్ణయించాం. స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతు కమిషన్ ఏర్పాటు చేస్తాం. రూ.2 లక్షల వరకు రైతులకు ఏకమొత్తంలో రుణమాఫీ ఉంటుంది. బీజేపీ మాత్రం వీటిపై ఏమీ చెప్పలేకపోతోంది. ఎన్డీఏ కింద బడాబాబులకు బీజేపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల రుణమాఫీ చేసింది. ఉపాధిహామీ పథకానికి 2023–24లో కేంద్రం రూ.72 వేల కోట్లు కేటాయించగా, 2024–25కి మాత్రం 65 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. కేంద్రంలో కాంగ్రెస్ వస్తే ఉపాధి కూలీ రోజుకు రూ.400 ఇస్తాం. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పసుపు, మామిడి పంటలకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నందిపేట మండలం లక్కంపల్లి సెజ్‌లో ఏర్పాటు చేయిస్తాం. ఈ సెజ్ 400 ఎకరాల్లో కాంగ్రెస్ హయాంలోనే ఏర్పాటయ్యింది. పసుపు బోర్డును ఎన్నికల ముందు ప్రధానితో ప్రకటింపజేసిన ఎంపీ అర్వింద్ 6 నెలలు గడుస్తున్నప్పటికీ దాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తారో చెప్పలేని పరిస్థితి. పసుపు బోర్డు కాగితాల్లోనే ఉంది. కాంగ్రెస్‌ను గెలిపిస్తే పసుపు మద్దతు ధర కనీసం రూ.15 వేలకు తగ్గకుండా చూస్తాం.

షుగర్ ఫ్యాక్టరీలను..

2001–02లో టీడీపీ–బీజేపీ ప్రభుత్వ హయాంలో నిజాం షుగర్స్‌ను ప్రైవేటుపరం చేశారు. ఆ సమయంలో మెట్‌పల్లి బీజేపీ ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి, కరీంగనగర్ ఎంపీగా చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఉన్నారు. నిజాం షుగర్స్‌లో 51 శాతం వాటాను బీజేపీ నాయకుడు గోకరాజు గంగరాజు కొనుగోలు చేశాడు. 2015లో కేసీఆర్ కుమార్తె కవిత ఎంపీగా ఉన్న సమయంలో పూర్తిగా మూసేశారు. 2019లో నిజాం షుగర్స్ తెరిపిస్తానని ఎంపీ అర్వింద్ చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం ఉన్నప్పటికీ అర్వింద్ తెరిపించలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నిజాం షుగర్స్‌పై కమిటీ వేసి పునరుద్ధరణకు రంగం సిద్ధం చేశాం. 2025లో ఫ్యాక్టరీ ప్రారంభిస్తాం.

గల్ఫ్ కార్మికులకు పరిహారం

గల్ఫ్ కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయనున్నాం. ఇంకా బోర్డు ఏర్పాటు కాకున్నా ఇప్పటికే మరణించిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం మా ప్రభుత్వం ఇచ్చింది.

నిజామాబాద్ అభివృద్ధిపై..

నిజామాబాద్ నగరం గతంలో వరంగల్ తరువాత రాష్ట్రంలో పెద్ద నగరం. ఇలాంటి నిజామాబాద్ కంటే ముందే జగిత్యాలను అభివృద్ధి చేశా. నిజామాబాద్‌కు జగిత్యాల స్థాయి కూడా లేదంటే కవిత, అర్వింద్ బాధ్యులు కాదా. జగిత్యాలలో ప్రభుత్వ వ్యవసాయ, వెటర్నరీ కళాశాలలు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఏర్పాటు చేయించా. 'న్యాక్' శిక్షణ తెలంగాణ రీజినల్ సెంటర్ జగిత్యాలలో ఉంది. కాంగ్రెస్ హయాంలోనే నిజామాబాద్‌లో తెలంగాణ వర్సిటీ, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేశాం. ఎంపీగా గెలిపిస్తే ఇందూరు వాణిని పార్లమెంట్‌లో వినిపిస్తా. నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా చేయిస్తా. నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయిస్తా. నిజామాబాద్ జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేలా కృషి చేస్తా. క్యాథ్ ల్యాబ్స్ ఏర్పాటు చేయిస్తా. గత ప్రభుత్వ హయాంలో జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సర్జరీ సేవలు మినహా ఏమి చేయలేదు.

చేనేత కార్మికులకు..

చేనేత కార్మికుల వృత్తికి గుర్తింపు తీసుకొచ్చేందుకు పద్మశాలి కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వనుంది. బీడీ కార్మికులకు పింఛన్లు పెంచుతాం. చివరగా ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు.

ఓట్ల పేరుతో వసూళ్లు

- తన పరిధిలో 7వేల ఓట్లు ఉన్నాయని నమ్మించిన ఉపాధ్యాయ సంఘం నాయకుడు
- గత ప్రభుత్వ కీలక ప్రజాప్రతినిధికి రూ.25 లక్షలు టోకరా

నిజామాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓ ప్రధాన ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఓట్ల పేరుతో డబ్బులు వసూలు చేసిన విషయం బయటకుపొక్కడం సర్వత్రా చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. తాను ఉపాధ్యాయులకు ఎంత చెబితే అంత.. అని, ఐదు నియోజకవర్గాల పరిధిలో టీచర్లతోపాటు వారి కుటుంబాల ఓట్లు 7వేలు ఉన్నాయని నమ్మించాడు. ఒక్కో నియోజకవర్గానికి రూ.10లక్షల చొప్పున ఇవ్వాలని ఏకంగా అప్పటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాటి ప్రజాప్రతినిధిని సంప్రదించాడు. అతడి మాటలు నమ్మిన ప్రజాపతినిధి ఒక్కో నియోజకవర్గానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.25 లక్షలు ఉపాధ్యాయ సంఘం నాయకుడికి ఇచ్చాడు. డబ్బులు వసూలు చేసిన ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఆ తరువాత ఉపాధ్యాయులను వారి కుటుంబ సభ్యులను ఎక్కడా కలవలేదు. పరోక్షంగా ప్రచారం చేసి ఓట్లు వేయిస్తానని నమ్మించిన ఉపాధ్యాయుడు.. డివిజన్లవారీగా ఆయా నియోజకవర్గాల్లో 20 మందిలోపు జిల్లా, మండల స్థాయి నాయకులకు ఒక్కోరోజు ఒక్కోచోట విందులు ఏర్పాటు చేశాడు. తాను డబ్బులు తీసుకువచ్చిన విషయం ఉపాధ్యాయులకు తెలియనీయకుండా జాగ్రత్తపడుతూ.. ఆ రాజకీయ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని సూచించాడు. తరువాత జరిగిన ఎన్నికల్లో ఆ రాజకీయ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో డబ్బుల అంశాన్ని ప్రజాప్రతినిధి అనుచరుడు లేవనెత్తాడు. ఈ విషయమై ఆయా మండలాల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు జిల్లాస్థాయి సమావేశంలో నాయకుడిని ప్రశ్నించారు. అయితే, తాను డబ్బులు తీసుకోలేదని.. ఆ రాజకీయ పార్టీకి ఓట్లు వేయాలని పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు మాజీ ప్రజాప్రతినిధిని కలువగా.. తాను డబ్బులు ఇచ్చిన మాట వాస్తవమేనని తెలుపడంతో సంఘంలో విభేదాలు తలెత్తాయి. సంఘం జిల్లా నాయకుడిపై రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా సమావేశమై చర్చినట్లు సమాచారం. ఎన్నికలు ముగియగానే సదరు నాయకుడిపై చర్యలు తీసుకునేలా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని సంఘం నాయకుడు ఒకరు అన్నారు.

గాలివాన బీభత్సం

బోధన్/రుద్రూర్: భారీ ఈదురు గాలులతో కూడిన వడగాళ్ల వాన బీభత్సం సృష్టించింది. బోధన్, సాలూర, పోతంగల్, రుద్రూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి అకాల వర్షం కురిసింది. సాలూర మండలంలోని మందర్న, హున్సా, ఖాజాపూర్, పోతంగల్ మండలం సోంపూర్, టాక్లీ గ్రామాల్లో వడగళ్లు కురిశాయి. వర్షంతో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశలో ఉన్న పంటలు దెబ్బ తింటాయని వాపోతున్నారు. పలుచోట్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది.

వర్నిః వడగళ్ల వర్షంతో వర్ని, చందూర్, మోస్రా మండలాల్లోని జలాల్పూర్, పైడిమల్, సిద్దాపూర్, గుంటూరు క్యాంప్, హనుమజిపేట గ్రామల్లో వరి, పొద్దుతిరుగుడు పంటలు దెబ్బతిన్నాయి.



పైడిమల్ గ్రామంలో పడిన వడగళ్లు



నామినేషన్ల దాఖలుకు నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: నామినేషన్ల దాఖలుకు నిబంధనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అవలంభించాల్సిన విధానాలపై కలెక్టర్ వివరించారు. ఈ నెల 18 నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని, కలెక్టర్ ఛాంబర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు అందించాల్సి ఉంటుందన్నారు. ఆదివారం మినహాయించి ఈ నెల 25 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థులు రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన వారైతే రూ.12,500 డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

అనుమతులు తీసుకోవాలి

ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత ఏఆర్వో, ఆర్వో కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.95 లక్షలు ఖర్చు చేయొచ్చు

అభ్యర్థులు వేరే పార్లమెంట్ సెగ్మెంట్ వారైతే తప్పనిసరిగా ఆ అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వో నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రిజిస్టర్డ్, గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్–3 లో 'సి' కాలం ఎదురుగా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తుల్లో ఏవైనా మూడు గుర్తులను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేస్తూ వివరాలు పొందుపర్చాలన్నారు. అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ తెరవాలని, దీని ద్వారానే ఎన్నికల వ్యయానికి లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చని వివరించారు. అభ్యర్థుల కోసం ఆర్వో కార్యాలయం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నీటి సరఫరాను పర్యవేక్షించాలి

- జిల్లా ప్రత్యేకాధికారి శరత్

సుభాష్‌నగర్: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి శరత్ సూచించారు. సోమవారం ఆయన సెల్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో నీటి సరఫరా పర్యవేక్షణ తీరుపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇబ్బందులు తలెత్తితే తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చివరి ప్రయత్నంగా మాత్రమే అద్దె ట్యాంకర్లను వినియోగించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన జిల్లా అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరా తీరు పరిశీలించారని తెలిపారు. ఎంపీడీవోలు, ఎంపీవోలతో కూడిన క్లస్టర్ బృందాలు సైతం ఏర్పాటు చేశామని ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు. 239 మంది పంప్ మెకానిక్‌లు, 77 మంది సహాయ మెకానిక్‌లు మరమ్మతులకు అందుబాటులో ఉన్నారన్నారు. నీటి సరఫరా మెరుగుపర్చేందుకు ఉద్దేశించి పెండింగ్‌లో ఉన్న 178 పనుల్లో వారం వ్యవధిలోనే 36 పనులను పూర్తిచేశామని పేర్కొన్నారు. 10 రోజుల్లో మిగితా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సెల్ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, మున్సిపాలిటీల కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



రాజీవ్‌గాంధీ(కలెక్టర్) , కల్మేశ్వర్ (సీపీ)

సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ క్రోధినామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలకు శుభాలు చేకూరాలని, అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నిండాలని కోరుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.













అడవిలో ఎలుగుబంటి కళేబరం

వేటాడారా? హైనాలు దాడి చేశాయా?

- మద్దికుంట – రెడ్డిపేట గ్రామాల మధ్య ఘటన
- రోజులు గడుస్తున్నా గుర్తించని అటవీశాఖ అధికారులు


మద్దికుంట - రెడ్డిపేట అటవీ ప్రాంతంలో కనిపించిన ఎలుగుబంటి తల

రామారెడ్డి: మండలంలోని మద్దికుంట – రెడ్డిపేట గ్రామాల మధ్య అటవీప్రాంతంలో ఎలుగుబంటి పిల్ల మృతి చెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. అయితే, ఎలుగుబంటి పిల్ల రెండు నెలల క్రితం మృతి చెందిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో ఎలుబంటి తల పడి ఉండగా, మరోచోట దాని వెంట్రుకలు, పక్కనే పెద్దకర్ర పడి ఉండడంతో వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై మాచారెడ్డి రేంజ్ అధికారిణి దివ్య స్పందించారు. ఎలుగుబంటి పిల్ల నీళ్ల లేక మృతి చెందలేదన్నారు. కళేబరాన్ని కళేబరాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామని, నక్కలు లేదా హైనాల దాడిలో మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే, వివిధ రకాల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి పనికొస్తాయని ఎలుగుబంటి అవయవాలతోపాటు గోళ్లను అమ్ముకుని వేటగాళ్లు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

జంతువుల వేట ఆగడం లేదా?

మండలంలో ప్రధానంగా అన్నారం, రెడ్డిపేట, సింగరాయపల్లి అటవీ ప్రాంతాల్లో జంతువుల వేట కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అన్నారం గ్రామంలో జంతువుల వేట కోసం దాచిన నాటుబాంబు పేలిన ఘటన మరవకముందే అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి పిల్ల కళేబరం కనిపించింది. గతేడాది సింగరాయపల్లి అడవుల్లో జంతువులను వేటాడేందుకు వెళ్లి రెడ్డిపేట గ్రామానికి చెందిన శాడ రాజు బండరాళ్ల మధ్య ఇరుక్కున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. జిల్లా అధికారయంత్రాంగం రెండురోజులపాటు శ్రమించి రాజును బయటికి తీశారు.

కొన్ని నెలల క్రితం వేటగాడు శాడ రాజు ఇంట్లో వలను స్వాధీనం చేసుకున్నట్లుగా అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. సింగరాయపల్లి, రెడ్డిపేట ప్రాంతాల్లో అడవులు విస్తరించి ఉండటం, అటవీశాఖ అధికారుల నిఘా కొరవడడంతో జంతువుల వేట ఇష్టానుసారంగా కొనసాగుతోందని మండలవాసులు అంటున్నారు. ఇటీవలే నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రెండు సెక్షన్లకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమర్పించకపోవడంపై ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సభ్యులు అటవీశాఖ సెక్షన్ అధికారులు శంకర్, జయశ్రీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన నాలుగేళ్లలో రెండు సెక్షన్ల పరిధిలోని ప్రగతి నివేదికలను సభలో సమర్పించలేదన్నారు.

చింతల్‌గుట్ట శివారులో సంచారం..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని చింతల్‌గుట్టతండా శివారులో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు తండావాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం గ్రామం పక్కనే ఉన్న చెరువులో నీళ్లతాగి తిరిగి వెళ్తున్న దృశ్యాలను తండావాసులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. తండాకు చెరువు ఆనుకొని ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అడవిలో నీళ్ల లేక గత వారం రోజులుగా ప్రతి రోజూ చెరువుకు వస్తున్నదన్నారు. అటవీశాఖ అధికారులు సాసర్ ఫీట్లలో నీరు నింపాలని కోరుతున్నారు. గొర్రెలు, మేకల కాపరులు, తునికాకును సేకరించేందుకు మహిళలు ప్రతిరోజూ అటవీ ప్రాంతానికి వెళ్తారని, తండాకు చెందిన పిల్లలు చెరువువైపు తిరుగుతుంటారని తెలిపారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.

బీఆర్‌ఎస్‌ను వీడనున్న సీనియర్ నాయకుడు


దాసరి నర్సింలు

నిజామాబాద్‌నాగారం: 1963 నుంచి రాజకీయాల్లో కొనసాగుతూ ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్న అఖిల భారత పద్మశాలీ సంఘం సెంట్రల్ బోర్డ్ సభ్యుడు, పద్మశాలీ వధూవరుల పరిచయ వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నర్సింలు ఆ పార్టీని వీడనున్నారు. 1963లో ఎన్‌ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1969లో డీసీసీ అధ్యక్షుడిగా నర్సింలు పని చేశారు. 2018 పార్లమెంట్ ఎన్నికల సమయంలో కల్వకుంట్ల కవిత, రాంకిషన్‌రావు, గణేశ్‌గుప్తా బీఆర్‌ఎస్‌లోకి నర్సింలును ఆహ్వానించగా, ఆయన పార్టీలో చేరారు. రెండుమూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు నర్సింలు తెలిపారు. నగరంలోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడుసార్లు డీసీసీ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా, ఒకసారి డీసీసీ అధ్యక్షుడిగా కాంగ్రెస్‌కు సేవలందించానన్నారు. 85ఏళ్ల వయస్సులోనూ కాంగ్రెకు సేవలందించాలనే ఉద్దేశంతో పార్టీలో చేరుతున్నానని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత సర్వీస్


విద్యార్థులను ఆటోలో తీసుకెళ్తున్న జేతిలాల్

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : సుమారు 3 కి.మీ దూరం విద్యార్థులు నిత్యం పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుండడం చూసిన ఆ యువకుడు వారి కష్టాన్ని దూరం చేసేందుకు ముందుకొచ్చాడు. నిత్యం సుమారు 50మంది విద్యార్థులను తన ఆటోలో ఉచితంగా తీసుకెళ్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండలంలోని కాటేపల్లి తండాలో 50 మంది విద్యార్థులు కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. వారికి దూరభారం కావడంతో తండాకు చెందిన యువకుడు బామన్ జేతిలాల్ తనకున్న ఆటోలో నిత్యం వారిని కాటేపల్లి వరకు ఉదయం, మధ్యాహ్నం ఉచితంగా తీసుకెళ్తూ తీసుకొస్తున్నాడు. తండావాసులు ఈ సందర్భంగా బామన్ జేతిలాల్‌ను అభినందిస్తున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఎడపల్లి (బోధన్): మండల కేంద్రంలో 15 ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారని 1098కి సమాచారం అందడంతో మండల అధికారులు సోమవారం అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులతోపాటు బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపివేశారు. కౌన్సెలింగ్ లో ఐసీడీఎస్ సూపర్ వైజర్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, సెక్రెటరీ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

కిడ్స్‌కేర్ ఆస్పత్రిలో మరోసారి విచారణ

- ఈ నెల 10న కలెక్టర్‌కు నివేదిక

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కిడ్స్‌కేర్ ఆస్పత్రిలో అధికారులు రెండోసారి విచారణ చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనాదేవి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం విచారణ కొనసాగింది. కాలం చెల్లిన ఇంజక్షన్ ఇవ్వడం కారణంగా తమ బాబు మృతి చెందాడని డిచ్‌పల్లి మండలానికి చెందిన 10నెలల బాలుడి తల్లిదండ్రులు బాబయ్య, మంజుల కలెక్టర్‌తోపాటు నిజామాబాద్ ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై ఈనెల 6వ తేదీన ఓసారి, సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఈనెల 10వ తేదీన డీఎంహెచ్‌వో ద్వారా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనాదేవి తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సైతం నివేదికను అందించనున్నారు.

నిజాయితీ చాటుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

బాన్సువాడ : రోడ్డుపై దొరికిన బంగారాన్ని సీఐ కృష్ణకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వాతి. బాన్సువాడ పట్టణానికి చెందిన గాదం స్వాతి నిజాంసాగర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత పనిపై సోమవారం బాన్సువాడకు వెళ్లి తిరిగి వస్తుండగా, రోడ్డుపై రెండు గ్రాముల పుస్తెపడి ఉండడంతో చుట్టు పక్కల వారిని వాకబు చేశారు. దొరికిన బంగారాన్ని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐకు అప్పగించగా, సీఐ బీట్ ఆఫీసర్‌ను అభినందించారు. స్వాతి వెంట ఆమె తండ్రి సత్యనారాయణ ఉన్నారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి



డిచ్‌పల్లి: ఎరువుల బస్తాలను ఈ పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలని, అలా కాకుండా నేరుగా రైతులకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) వాజిద్ హుస్సేన్ హెచ్చరించారు. సోమవారం డిచ్‌పల్లి మండల వ్యవసాయాధికారి రాంబాబుతో కలిసి మండలంలోని ధర్మారం(బి), నడిపల్లి, డిచ్‌పల్లి గ్రామాల్లోని ఎరువుల విక్రయ కేంద్రాలను డీఏవో తనిఖీ చేసి.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించారు. ఎరువుల బస్తాలను రైతులకు నేరుగా విక్రయించొద్దని సూచించారు.

మహిళా సంఘం నగదు సీజ్



మాక్లూర్: మండలంలోని మాదాపూర్‌కు చెందిన ఓ మహిళ సంఘం నగదును బ్యాంకులో జమ చేసేందుకు వెళ్తుండగా పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మాదాపూర్‌లోని ఓ మహిళా సంఘం సభ్యురాలు సంఘానికి సంబంధించిన డబ్బులు రూ.67,200 బ్యాంకులో చేయాలని తన భర్తకు ఇచ్చి పంపింది. ఎలక్షన్ కోడ్‌లో భాగంగా సోమవారం ఉదయం మాదాపూర్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు సదరు వ్యక్తి వద్ద ఉన్న నగదును సీజ్ చేశారు. తన భర్త నగదుకు సంబంధించిన అన్ని ఆధారాలను పోలీసులకు చూపినప్పటికీ సీజ్ చేసి కేసు చేశారని మహిళా సంఘం సభ్యురాలు లత ఎన్నికల అధికారిణి జె.క్రాంతికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది.

భారత రాజ్యాంగానికి ప్రత్యేకత ఉంది

- సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ రాధాకృష్ణ చౌహాన్
- వర్సిటీలో కొనసాగుతున్న గ్రూప్ – 1 కోచింగ్


మాట్లాడుతున్న సివిల్ జడ్జి డాక్టర్ రాధాకృష్ణ చౌహాన్

తెయూ(డిచ్‌పల్లి): ప్రపంచ దేశాల్లోనే భారత రాజ్యాంగానికి ఒక ప్రత్యేకత ఉందని సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, రిసోర్స్ పర్సన్ డాక్టర్ రాధాకృష్ణ చౌహాన్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ కాంపిటేటీవ్ సెల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రూప్–1 కోచింగ్ తరగతులలో సోమవారం ఆయన రిసోర్స్ పర్సన్‌గా హాజరై 'ప్రజాస్వామ్యం – భారత రాజ్యాంగం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచ దేశాల సుపరిపాలన విధానాలను తీసుకుని భారత రాజ్యాంగంలో పొందుపర్చారని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా రాజ్యాంగం తన విశిష్టతను కాపాడుకొంటోందని పేర్కొన్నారు. అనంతరం తన వంతుగా పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను వర్సిటీ సెంట్రల్ లైబ్రరీకి అందజేశారు. విద్యార్థులకు తన అనుభవాన్ని జోడించి, ప్రేరణ కలిగించిన డాక్టర్ రాధాకృష్ణ చౌహాన్‌ను తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, కాంపిటేటీవ్ సెల్ డైరెక్టర్ కేవీ రమణాచారి, కామర్స్ డీన్ ప్రొఫెసర్ రాంబాబు సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వికాసానికి, వినాశనానికి మధ్య ఎన్నికలు

- ప్రజల సంక్షేమమే బీజేపీ ఎజెండా
- 12 స్థానాల్లో విజయం సాధిస్తాం
- కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారింది
- తెలంగాణ పార్లమెంట్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్


మాట్లాడుతున్న అభయ్ పాటిల్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు బీజేపీ వికాసానికి, కాంగ్రెస్ వినాశనానికి మధ్య జరుగుతున్నాయని, ప్రజలు వినాశనాన్ని కోరుకుంటారా? వికాసాన్ని దగ్గరవుతారా? అని తెలంగాణ పార్లమెంట్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్ పాటిల్ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ రాజకీయాల్లో బీజేపీ క్రియాశీల పాత్రపోషిస్తోందని, మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో ప్రధాని మోదీ నడిపించారని, మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధితోపాటు పెండింగ్ పనులను కూడా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు మళ్లీ బీజేపీని గద్దెనెక్కిస్తారని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ నాయకులు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రధాని మోదీని ఓడించే ఎజెండా మాత్రమే ఉందని, కానీ దేశ ప్రజల సంక్షేమమే బీజేపీ ఎజెండా అని స్పష్టంచేశారు. తెలంగాణలో జరిగే పార్లమెంట్ ఎన్నికలు దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తేనున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి ట్యాక్స్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి 12 సీట్లు పక్కాగా వస్తాయని, దేశంలో 370 సీట్లలో బీజేపీ గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ ప్రభారీ వెంకటరమణి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు గద్దె భూమన్న, పద్మారెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, నారాయణ యాదవ్, బద్దం కిషన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ప్రైవేట్ టీచర్ మృతి


సంధ్య (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు గొట్టుముక్కల సంధ్య (26)సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం బీపీ ఎక్కువ కావడంతో సంధ్య స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోలో ఉందని స్థానికులు తెలిపారు. ఆదివారం మళ్లీ బీపీ ఎక్కువకావడంతో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

ఆర్మూర్‌టౌన్: పట్టణ శివారులోని జాతీయ రహదారి నంబర్ 63పై గుర్తుతెలియని వాహనం ఢీకొని రమేశ్(55) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. అంకాపూర్ సమీపంలోని ఓ క్రషర్‌లో పనిచేసే రమేశ్ రోజులాగే ఆదివారం రాత్రి 8గంటలకు సైకిల్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో పట్టణ శివారులో గుర్తు తెలియని వాహనం సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో రమేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రమేశ్ మృతి చెందినట్లు వైద్యులు అంబులెన్స్ సిబ్బందికి తెలిపారు. సోమవారం ఉదయం సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిస్థితి విషమించి..

రుద్రూర్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రఘు (39) అనే వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం ఆచన్‌పల్లికి చెందిన తాటి రఘు ఈ నెల 6న రుద్రూర్‌లోని అత్తవారింటికి వచ్చాడు. సాయంత్రం వేళ నడుచుకుంటూ వస్తుండగా ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని బోధన్ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటిలో మునిగి జాలరి..

రెంజల్(బోధన్): కుల సభ్యులతో కలిసి చెరువులో చేపల వేటకు వెళ్లిన జాలరి ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులకు వల చుట్టుకోవడంతో మృతిచెందాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దూపల్లికి చెందిన బొత్త లస్మయ్య(65) కులసభ్యులతో కలిసి ఆదివారం గ్రామపెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలను వేటాడుతుండగా ప్రమాదవశాత్తు వల అతడి చేతులు, కాళ్లకు చుట్టుకోవడంతో నీటిమునిగిపోయాడు. కులసభ్యులు నీటిలో ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం నీటిపై మృతదేహం తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కొడుకు భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు



భీమ్‌గల్ : మండలంలోని కారెపల్లి వద్ద స్కూల్ బస్సు చెట్టును ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు సోమవారం ఉదయం కారెపల్లిలో విద్యార్థులను ఎక్కించుకొని భీమ్‌గల్ వైపు వెళ్తుండగా స్టీరింగ్‌లో సమస్య తలెత్తి అదుపు తప్పి కారెపల్లి గండి ఘాట్ రోడ్డు వద్ద చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఘటనపై స్థానిక నాయకులతో మాట్లాడారు. ఆందోళన చెందొద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్ చోరీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్‌ను దుండగులు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. జనార్దన్‌రెడ్డి, సంజీవరెడ్డి అనే రైతులకు సంబంధించిన పంటపొలాల్లో ఉన్న రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దొంగలు ఆయిల్‌ను చోరీ చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు మనోరంజన్, శశికాంత్‌రెడ్డి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి శివారులో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఐదుగురి అదుపులోకి తీసుకొని రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చదువు ఇష్టం లేక ఆత్మహత్య


సూర్య(ఫైల్)

నవీపేట: చదువు ఇష్టం లేక మండలంలోని నాగేపూర్ గ్రామానికి చెందిన సూర్య(17) సోమవారం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై గఫార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇటీవల ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన సూర్య జిల్లా కేంద్రంలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆదివారం రోజు తన తండ్రి శ్రీనివాస్ పుట్టినరోజు కావడంతో స్వగ్రామానికి వచ్చి వేడుకలో పాల్గొన్నాడు. ఆ తరువాత సూర్య విద్యాభ్యాసంపై చర్చ జరుగగా.. తనకు చదువంటే ఇష్టం లేదని, కోచింగ్‌లో ఏమీ అర్థం కావడం లేదని ఇంట్లో తెలిపాడు. అమ్మానాన్నల ఆశలకు అనుగుణంగా చదువలేకపోతున్నానని తీవ్ర మనస్తాపం చెంది యంచ శివారులోని గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

భార్యతో గొడవపడి..

వర్ని (మోస్రా) : మోస్రా గ్రామానికి చెందిన దూపల్లి సాయిలు భూమి విషయంలో తన భార్యతో గొడవపడి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్న సాయిలు క్షణికావేశంలో ఉరేసుకున్నాడని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లోని మైనారిటీ స్టడీ సర్కిల్ శిక్షణ కేంద్రంలో యూపీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.దయానంద్ తెలిపారు. వంద మందికి శిక్షణ ఇస్తారని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28న కామారెడ్డి జిల్లాకు సంబంధించి జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని తెలిపారు.